క్లుప్తంగా

దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శనకు విశేష స్పందన


ఎగ్జిబిషన్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వాహకులు వస్తు ప్రదర్శన ఏర్పాటు చేశారు. దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ కేంద్రాల్లో శిక్షణ పొందిన వారు ఉత్పత్తి చేసిన చేనేత వస్తువులను విక్రయానికి పెట్టారు. చేనేత వస్త్రాలు, దుప్పట్లు, చీరలు, షర్ట్ క్లాత్‌లు, బనియేన్లు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు, పిల్లలకు స్కూల్ బ్యాగులు, క్యాంప్ బ్యాగులు, అగర్‌బత్తిలు, తలకు రాసుకొనే పలు రకాల నూనెలు, సబ్బులు, చెప్పులు తదితర వస్తువులు విక్రయించారు. విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఎంవీపీ కాలనీ, ఆరిలోవ ప్రాంతాల నుంచి వెళ్లిన వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేశారు. ప్రదర్శన ప్రారంభమైన సుమారు ఒక గంట వ్యవధిలోనే ఇక్కడ వస్తువులన్నీ అమ్ముడయ్యాయి.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి


ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసిన బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

మహారాణిపేట: రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పరిష్కారానికి సహకారం అందించాలని ఏపీఆర్ఎస్ఏ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జేఏసీ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అనేక విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ నగర అధ్యక్షుడు యోగి, ఇతర సంఘాల నాయకులు కె.ఎస్.రావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హాస్య వల్లరి

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం హాస్యవల్లరి పేరిట ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పండించాయి. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎ స్.రామానుజం నేతృత్వంలో క్లబ్ కళాకారులు భానుప్రకాష్, ఆర్ఎస్ఎన్ మూర్తి, డీఎస్ఎన్ మూర్తి, నాగ గణేష్, శివజ్యోతి ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో సినిమా టిక్కెట్లు, మీరు చాలా అందంగా ఉన్నారు, కేసు గెలిచా, షాపింగ్‌మాల్ అమ్మ, తాగుబోతు బిచ్చగాడు, గండభేరుండం స్కిట్స్ చక్కటి హాస్యాన్ని పండించాయి. ఇటీవల కీర్తిశేషులైన బాదంగీర్ సాయి, చింతా ప్రభాకర్ ఆత్మలు శాంతించాలని క్లబ్ సభ్యులు మౌనం పాటించారు.

నృత్య ప్రదర్శనలు అదరహో


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మీంం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన శాస్త్రీయ జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. సింహాచలంకు చెందిన సరస్వతి నృత్య కళామందిర్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు తాము అభ్యసించిన నృత్య రీతులను అద్భుతంగా ప్రదర్శించి, అలరించారు. మూషిక వాహన నృత్యాంశంతో ప్రారంభమైన కార్యక్రమంలో బ్రహ్మ కడిగిన పాదము, అదివో అల్లదివో .. ముద్దుగారే యశోదా.. తదితర అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఆహార తనిఖీ ఏదీ..?


పెదవాల్తేరులోని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ కార్యాలయం

గ్రేటర్ విశాఖలో ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ విపరీతంగా పెరుగుతోంది. బయట ఫుడ్ తినేందుకు మక్కువ చూపిస్తున్న యువత కలుషిత ఆహారాన్ని తిని రోగాల బారిన పడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు కుళ్లిన మాంసం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యం గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు. దీనిపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కలుషిత ఆహారంపై పలువురు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు.


ఓ హోటల్‌లో కుళ్లిన ఆహారం

- హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు శూన్యం
- ఆహార పదార్థాలు నిల్వ చేస్తూ విక్రయాలు
- ఫిర్యాదులు పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు


ఆహార పరీక్షల కేంద్రంలో నులక మంచం


ఫుడ్ కంట్రోల్ కార్యాలయ ప్రాంగణంలో మద్యం బాటిళ్లు

బీచ్ రోడ్డు: నగరంలో పుట్టగొడుగుల్లా రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కర్రీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. వీరిలో కొందరు వ్యాపారులు ఆహార భద్రత నియమ నిబంధనలు ఏమాత్రం పాటించడం లేదు. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసేందుకు అధికారులు కూడా ఉండరు. దీంతో ఇష్టానుసారంగా కలుషిత ఆహారాన్ని అమ్ముతూ ఆహారప్రియుల జీవితాలతో నిర్వాహకులు ఆటలాడుతున్నారు. కలుషిత ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అనేక మంది ఆరోపిస్తున్నారు.

ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులు

ఆహార తనిఖీలు నిర్వహించేందుకు జిల్లాలో ఒక అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ముగ్గురు ఫుడ్ సేఫ్టీ అధికారులున్నారు. వీరిలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఇద్దరు అధికారులు ఏళ్ల తరబడి తిష్ట వేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ ఆరేళ్లకు పైగా విధుల్లో ఉండగా.. ఫుడ్ సేఫ్టీ అధికారులు అప్పారావు, ఆనంద్ పదేళ్లకు పైగా ఇక్కడే పనిచేస్తున్నారు. నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్ల యాజమాన్యాలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని వారిపై వస్తున్న ఫిర్యాదులను తొక్కిపెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించడం మినహా పెద్ద పెద్ద రెస్టారెంట్లు, హోటళ్లలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు.

నిర్లక్ష్యానికి కేరాఫ్.. ఫుడ్ సేఫ్టీ కార్యాలయం

ఫుడ్ సేఫ్టీ అధికారులే కాదు.. పెదవాల్తేరులోని ఫుడ్ సేఫ్టీ కార్యాలయం మొత్తం అధ్వానంగా మారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యాలయ ప్రాంగణంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆఫీస్, ప్రాంతీయ ఆహార పరీక్షల కేంద్రం ఉంటుంది. ఇక్కడ అధికారులు సమయానికి అందుబాటులో ఉండరు. ఫోన్ చేసినా స్పందించరు. కార్యాలయ ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఈ ప్రాంగణంలో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమిస్తాయి. ప్రాంతీయ ఆహార పరీక్షల కేంద్రంలో ఆహారం, నీటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కొన్నేళ్లుగా ఆహార పరీక్షలు జరిపే పరికరాలు పనిచేయకపోవడంతో కేవలం నీటి పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. దీంతో ఖాళీగా ఉన్న సిబ్బంది కార్యాలయంలోనే నులక మంచం వేసుకొని సేద తీరుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆహార భద్రత విషయంలో తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ఆహార ప్రియులు కోరుతున్నారు.

స్పందించని అధికారులు.. కలెక్టర్‌కు ఫిర్యాదులు


ఫుడ్ సేఫ్టీ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వ్యక్తి (ఫైల్)

ఇటీవల బీచ్ రోడ్డులోని కామత్ హోటల్‌లో కుళ్లిన మాంసాన్ని విక్రయించారని ఒక వ్యక్తి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా.. వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దీంతో జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఆదేశించగా.. వారు మరుసటి రోజు హోటల్‌కు వెళ్లి తనిఖీలు చేపట్టారు. కలెక్టర్ స్థాయి వ్యక్తి చెబితే తప్ప ఫుడ్ సేఫ్టీ అధికారుల్లో చలనం రాలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఇతర అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోకపోతే హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు కలుషితమైన ఆహారాన్ని ఇష్టం వచ్చినట్లు అమ్ముకునేందుకు అవకాశముంటుందని ఆహార ప్రియులు అంటున్నారు.

టీటీడీలో గీతా జయంతి

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, మహిళలకు బహుమతులు అందజేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ


అంబలం పూజ చేస్తున్న భవానీ భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి పోలమాంబ ఆలయంలో ఆదివారం భవానీ మాల ధారులు అంబలం పూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కనకదుర్గాదేవి పీఠం ఆధ్వర్యంలో భవానీలు అమ్మవారి భక్తి పాటలతో భక్తులను ఆకట్టుకున్నారు. స్థానిక సంఘాల పెద్దలు బుదుమూరు గోవింద్ తదితరులు పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు చినజీయర్ స్వామి రాక

ఎంవీపీకాలనీ: శ్రీ త్రిదండి చినజీయర్ స్వామీజీ సోమవారం ఎంవీపీ కాలనీ తరలిరానున్నారు. ఎంవీపీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించనున్నారని ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న స్వామీజీ రానున్నట్లు ముందుగా వెల్లడించినప్పటికీ ఆ పర్యటన రద్దయ్యిందని చెప్పారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు స్వామీజీ రాక ఖరారైనట్లు వెల్లడించారు. ఆలయంలో మంగళశాసనం, అనుగ్రహ భాషణం జరుగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు ఆలయానికి తరలిరావాలని కోరారు.

ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో సత్తా


బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించిన ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: ఏపీ వింటర్ సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఎంవీపీ కాలనీ ఎస్3 స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడాకారులు సత్తా చాటారు. బీచ్ రోడ్డులోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా శని, ఆదివారాల్లో పోటీలు జరిగాయని ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా వ్యవస్థాపకుడు సహాని తెలిపారు. గ్రూప్-1 బాలురు విభాగంలో ఎస్.జిషితేశ్ నాయుడు 50 మీటర్లు, బటర్‌ఫ్లైలో రజతం, 100 మీటర్ల బటర్‌ఫ్లైలో బంగారం, 50 మీటర్లు ఫ్రీస్టైల్‌లో కాంస్యం సాధించాడన్నారు. గ్రూప్-1 బాలికల విభాగంలో హిమశ్రీ 50 మీటర్ల బటర్‌ఫ్లైలో రజతం, 50 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు ఫ్రీస్టైల్‌లో రజతం, కాంస్యం పతకాలు సాధించినట్లు చెప్పారు. గ్రూప్-3 బాలురు విభాగంలో ధీరజ్ 50 మీటర్లు, 100 మీటర్లు ఫ్రీస్టైల్‌లో బంగారం, కాంస్య పతకాలు గెలుపొందాడన్నారు. మొత్తంగా ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారులు 2 బంగారు పతకాలు, 4 రజత పతకాలు, 5 కాంస్యం పతకాలు సాధించినట్లు వెల్లడించారు.

జేవీ రత్నంకు ఎన్విరాన్మెంటల్ చేంజ్ మేకర్ అవార్డు


అవార్డుతో జేవీ రత్నం

ఎంవీపీకాలనీ: గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నంకు ఎన్విరాన్మెంటల్ చేంజ్ మేకర్ అవార్డు లభించింది. కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన రోటరీ సంస్థ 3వ జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ అంతర్జాతీయ అధ్యక్షురాలు స్టీఫెన్ యుర్చిక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 36 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషికి గాను రోటరీ ఇంటర్నేషనల్ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. సంస్థ నిర్వాహకులకు జేవీ రత్నం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు ఆయనను అభినందించారు.

'బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి'


కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలుపుతున్న నగరవాసులు

ఏయూ క్యాంపస్: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని నగరవాసులు నినదించారు. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద రాధారంగ రాయల్ అసోసియేషన్, అక్కడి హిందువులకు సంఘీభావంగా కొవ్వొత్తులు వెలిగించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గాది బాలాజీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో అన్యాయంగా అరెస్టు చేసిన ఇస్కాన్ స్వామీజీ చిన్మయ కృష్ణదాస్‌ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ స్థానంలో బెయిల్ రాకుండా అడ్డుకుంటూ అరాచకం చేస్తున్నారని ఆరోపించారు. ఇది హిందువులపై జరుగుతున్న దాడిగానే ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. భారత ప్రభుత్వం చొరవ తీసుకుని చిన్మయ దాస్‌ని విడుదల చేయించేటా చూడాలన్నారు. కార్యక్రమంలో తెలగపూడి శ్రీనివాసరావు, మహేంద్ర, గోవింద, శివకుమార్, కోటేశ్వరరావు, ఏడిద భార్గవ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న బాలమోహన్‌దాస్

సీతంపేట: మానవ హక్కుల పరిరక్షణకు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతోపాటు ఆదేశ సూత్రాలకు కూడా పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని గాంధీ సెంటర్ అధ్యక్షుడు వి.బాలమోహన్‌దాస్ అన్నారు. బీవీ ఫౌండేషన్, ఐఏఆర్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మానవ హక్కుల దినోత్సవ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సందర్భాల్లో హక్కుల పరిరక్షణ సాధ్యం కావడం లేదన్నారు. యువతకు హక్కులపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. బీవీ ఫౌండేషన్ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ గౌరవం, స్వేచ్ఛ, అందరికీ న్యాయం సాధించడంలో యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పద్దయ్య, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, మున్నార్, గోపాల్, రామేశ్వరి, అనిత, సూర్యనారాయణ, సత్యవతి, మంత్రి శ్యాంప్రసాద్, గౌరి తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీలో పీజీఆర్ఎస్

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా జర్నలిస్టుల వన సమారాధన


మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

ఎంవీపీకాలనీ: ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శివాజీ పార్కు వేదికగా నిర్వహించిన వన సమారాధన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ తాను రాజకీయంగా ఎదిగేందుకు విశాఖ జర్నలిస్టులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాత్రికేయుల పిల్లలకు వీఎంఆర్‌డీఏ పార్కుల్లో ఉచిత ప్రవేశం కల్పించే దిశగా త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయమై జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం ప్రణవ్‌గోపాల్‌ను అసోసియేషన్ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో స్థితప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు గంట్ల శ్రీనుబాబు, పి.నారాయణ, అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో సందర్శకుల సందడి



కొమ్మాది: భీమిలి సమీపంలోని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. భీమిలి బీచ్, మంగమారిపేట బీచ్, తొట్లకొండ, బావి కొండ, రామానాయుడు ఫిలిం స్టూడియో, రుషికొండబీచ్, సాగర్‌నగర్ బీచ్ ప్రాంతాలు జనంతో రద్దీగా మారాయి. వారంతా కుటుంబాలతో వచ్చి, ఆటపాటలతో సరదాగా గడిపారు.

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా స్తంభం


ముడసర్లోవ వెనుక రోడ్డు మధ్యలో విరిగిన ఇనుప స్తంభం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్డులో ఓ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇక్కడి రహదారుల్లోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా జీవీఎంసీ అధికారులు పలు చోట్ల అడ్డంగా గేట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన గేట్లను కొద్ది నెలల కిందట ఓ కారు ఢీకొనడటంతో విరిగిపోయాయి. దీంతో రోడ్డు మధ్యలో ఇనుప రాడ్లు అడ్డంగా నిలిచాయి. అవి ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహన చోదకులకు ఆటంకంగా మారాయి. వాహనాలు ఈ రాడ్లను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ ఈ రోడ్లలో ప్రయాణించే వాహన చోదకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన ఇనుప రాడ్లను వెంటనే తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ఘనంగా క్యూఎంబీ చర్చి వజ్రోత్సవం


హాజరైన క్రైస్తవులు


ప్రసంగిస్తున్న క్యూఎంబీ చర్చ్ అధ్యక్షుడు ఐజక్

మద్దిలపాలెం: స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలోనే విశాఖలో ఏడు బాప్టిస్టు సంఘాలు నెలకొల్పి క్రీస్తు సువార్త విస్తరణకు నడుంకట్టిన రెవరెండ్ ఈఎల్ క్వర్క్ సేవలు ఎనలేనివని క్వర్క్ మెమోరియల్ బాప్టిస్టు సంఘం (క్యూఎంబీ) అధ్యక్షుడు టి. ఐజక్ ప్రశంసించారు. ఆదివారం ఆరాధన అనంతరం రేసపువానిపాలెంలోని సంఘ ఆవరణలో చర్చి 75వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ఐజక్ మాట్లాడుతూ 1948 నుంచి నేటి వరకూ సంఘం అభివృద్ధికి సహకారాలందించిన ప్రతిఒక్కరికీ కతజ్ఞతలు తెలియజేశారు. కార్యదర్శి కాటపల్లి ఇజ్రాయిల్ మాట్లాడుతూ సంఘాభివృద్ధికి తమ వంతు శాయశక్తులా సేవలందించిన పూర్వపు సేవకుల పరిచర్యలను, త్యాగనిరతిని గుర్తు చేశారు. 1961లో కెనడా నుంచి విశాఖ సందర్శించిన క్వర్క్ అనుమతితో ఈ సంఘానికి ఆయన పేరు పెట్టిన విషయాన్ని, చరిత్రాత్మకమైన గుడిగంటల నిర్మాణ శైలిని వివరించారు. రెవరెండ్ డాక్టర్ జి. స్టీవెన్ పీటర్ , పాస్టర్ చార్లీ మోజెస్, భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మోహనం.. నృత్యోత్సవం


మయూరి నృత్య నికేతన్ విద్యార్థులతో నిర్వాహకులు


కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

మద్దిలపాలెం: అందెల రవళి అదిరింది. నాట్య సోయగం కనువిందు చేసింది. ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో బాలయ్యశాస్త్రి లే అవుట్‌కు చెందిన మయూరి నృత్య నికేతన్ 37వ వార్షికోత్సవం నయనమనోహరంగా సాగింది. నటరాజ విగ్రహానికి పుష్పమాలంకరణ అనంతరం నిర్వాహకులు తొలి ప్రదర్శనాంశంగా పురంధర దాసర్ సంకీర్తన గజవదన బేడువే గౌరి తనయ, హంసధ్వని రాగంలో ప్రేక్షకుల కర్ణభేరుల్ని సుతారంగా మీటుతుండగా నాట్య మయూరాలు పురివిప్పనారంభించాయి. గౌళ, ఆరభి రాగమాలికలో జేమ జేమ తనన.., పున్నాగవరాళి రాగంలో త్యగరాజ స్వామి కృతి గంధం పుయ్యరుగా.., రస హృదయాలను శృతి చేశాయి. మోహన రాగం ఆది/త్రిపుట తాళాలలో రాయాయణ శబ్దం, షణ్ముఖ ప్రియ, బి.లహరి, మధ్యమావతి రాగ మాలిక మిశ్రచాపు తాళంలో మండోదరి శబ్దం కృతులకనుగుణంగా కూచిపూడి అందెల రవళికి ఆడిటోరియంలో చప్పట్ల వర్షం కురిసింది.

మయూరి నృత్య నికేతన్ సంగీత, నృత్య సంస్థ వ్యవస్థాపక గురు ఉషారాణి, ఎం.మురళీ మోహన్‌ల నట్టువాంగ నిర్వహణ నాట్యకచేరీలను ఆద్యంతం మంచి రసపట్టులో నడిపించింది. గాన కోకిల కె.సూర్యనారాయణ అందించిన గాత్రం, ఆలాపనలు, వాయులీనంపై పి.గణపతి, మదంగంపై అనంతరావు, తబలాపై ఫణికుమార్ అందించిన వాద్యం వీనుల విందు చేశాయి.